క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విశ్వేశ్వరునికి ఏకాంత సేవ



పవళింపు సేవలో స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు ఏకాంత సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రవిశంకర్ బృందం కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో స్వామి, అమ్మవార్లను కనుల పండువగా అలంకరించారు. పూలతో ఏర్పాటు చేసిన శయ్యపై పవళింపజేశారు. మహిళా భక్తులు వింజామర సేవ నిర్వహించారు. పలు రకాల పండ్లు, తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. పూజలనంతరం హాజరైన భక్తులకు వాటిని ప్రసాదంగా అందజేశారు.

14న ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్: బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ జయంతులను పురస్కరించుకుని ఈనెల 14వ తేది కడప నగరంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షులు పెద్దలపల్లి ఓబులపతి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ఆరోజు ఉదయం 8 గంటలకు ర్యాలీ ప్రారంభమై కొత్త బస్టాండు వద్దగల అంబేడ్కర్ సర్కిల్ వరకు సాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఈ కార్యక్రమానికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

14 నుంచి ప్రచార భేరి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో ప్రచార భేరీని నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ప్రచార భేరీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలపై ప్రజలు పోరాడాలన్నారు. సీపీఐ, సీపీఎం నాయకులు రామ్మోహన్, చంద్రశేఖర్, వేణుగోపాల్, కేసీ బాదుల్లా, మనోహర్, దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై ఆందోళనలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాష్ట్రంలో రైతుల సమస్యలపై దశల వారీ ఆందోళనలు చేపడతామని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యంవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఏపీ రైతు సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు పెండింగ్‌లో ఉన్న పంటల బీమాను తక్షణం ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. 2022 ఖరీఫ్, రబీ సీజన్‌లో నష్టపోయిన రైతులకు పంటల బీమాను విడుదల చేయాలన్నారు. పసుపు క్వింటాకు రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం నాయకులు మనోహర్ రెడ్డి, జయన్న, కొమ్మద్ది ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'రామకృష్ణ నగర్‌లో సమస్యలను పరిష్కరించాలి'

కడప వైఎస్ఆర్ సర్కిల్: రామకృష్ణ నగర్‌లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని రామకృష్ణ నగర్‌లో పర్యటించిన ఆయన మాట్లాడుతూ రామకృష్ణ నగర్ ఏర్పడి దాదాపు 23 సంవత్సరాలు అవుతున్న మౌళిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో మంచి నీటి సమస్య ఎక్కువగా ఉందని వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వినోద్‌కుమార్, రమణ, యూసఫ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కేఎస్ఆర్ఎంలో మెగా కంటి వైద్య శిబిరం



విద్యార్థికి కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ శశిబిందు

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో కందుల శివానందరెడ్డి జయంతిని పురస్కరించుకుని బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి గాయత్రి నేత్రాలయ వైద్యురాలు డాక్టర్ శశిబిందు హాజరై కళాశాల అధ్యాపకులకు, విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, ఎండీ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, వివిధ శాఖల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే జగనన్నా



20వ డివిజన్‌లో సర్వే నిర్వహిస్తున్న డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు



50వ డివిజన్‌లో సర్వే చేపడుతున్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కట్టమీద రాజశేఖర్‌రెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళుతున్న కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ ప్రజలు నినదిస్తున్నారు. కడప నగరంలోని 20 డివిజన్ మారుతీనగర్, ఏపీహెచ్‌బీ కాలనీలో కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డిలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. గత టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి, వారి మొబైల్స్‌కు, ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు.

50వ డివిజన్‌లో..

కడప నగరం 50వ డివిజన్లోని చిన్నమాచుపల్లెలో వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె. రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును తెలుసుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు చంటి, శ్రీను, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఏపీ జేఏసీ అమరావతి నాయకులు, ఉద్యోగులు, పెన్షనర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు, పెన్షనర్లు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ జేఏసీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన మలిదశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా నేడు జిల్లా కేంద్రాల్లో తమ నిరసనలు తెలియజేస్తున్నామన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యాన్ని వీడి సత్వరమే పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్‌రావు, జిల్లా చైర్మన్ జీవన్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కేకే కుమార్, కోశాధికారి రొనాల్డ్ పాల్గొన్నారు.

ఇఫ్తార్‌తో పుణ్యఫలాలు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ కార్యక్రమాలతో అధిక పుణ్యఫలాలు లభిస్తాయని నగర ప్రముఖులు అఫ్జల్‌ఖాన్, డాక్టర్ సొహైల్ అహ్మద్ తెలిపారు. బుధవారం కడప నగరంలోని మారుతినగర్‌లో జన వికాస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్‌లో వారు పాల్గొన్నారు. అలాగే నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సేవా స్తంభ్ ఉపాధ్యక్షుడిగా దాసరి సుధాకర్



కడప కార్పొరేషన్ : ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ, బీసీ అండ్ మైనార్టీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దాసరి సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల కర్నూలులోని డా. బీఆర్ అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన్ను ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దాసరి సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లవేళలా సేవలందిస్తానని తెలిపారు.

తాగునీటి సమస్యలేకుండా చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి

వల్లూరు : గ్రామాల్లో తాగునీటి సమస్యలేకుండా చర్యలు చేపట్టాలని మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ సభా భవనంలో బుధవారం వైస్ ఎంపీపీ గంగయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే మంజూరు చేయాలన్నారు. అదే విధంగా జగనన్న లే అవుట్లలో ఖాళీగా వున్న ప్లాట్లను అర్హులకు కేటాయించాలన్నారు. తహసీల్దార్ అమరేశ్వరి మాట్లాడుతూ ఓటుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ జరుగుతోందని ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటును నమోదు చేసుకోవాలన్నారు. వాత్సల్య పథకం కింద పిల్లలకు నెలకు రూ.4 వేలు ఆర్థిక సాయం అందించడానికి అవకాశం వుందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈవోపీఆర్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లోని కూడళ్లలో మంచినీటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. మండలంలోని వల్లూరు, తోల్లగంగనపల్లె గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో వున్నాయని, 0 నుంచి 6 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ఆధార్ నమోదు చేయించుకోవాలని సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా వుందని, వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘు, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఓ సాయిజ్యోతి, ఏపీఓ పార్థసారథి, ఏపీఎం శైలజ, వైద్యాధికారి ప్రసన్నలక్ష్మి, పశు వైద్యాధికారి రవీంద్రారెడ్డి, ఏఈలు పవన్, ప్రతాప్ రెడ్డి, ముజీబ్, డానియల్ జోషెఫ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మకు వడిబియ్యం

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ క్షేత్రం మూడవ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు గోపాల్ సింగ్ దంపతుల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అమ్మవారికి తొలి పూజలు నిర్వహించారు. సంప్రదాయంగా అమ్మవారికి చీర,సారెలను వడిబియ్యంతో కలిపి సమర్పించారు. కడప నగరానికి చెందిన దాదాపు 450 మంది ముత్తయిదువులు సంప్రదాయంగా అమ్మవారికి వడిబియ్యం సమర్పించారు. అనంతరం నిర్వాహకులు వారికి వేదాశీస్సులు అందజేసి బృందాల వారీగా హాజరైన మహిళా భక్తుల్లోని ముత్తయిదువులకు ఆలయం పక్షాన వడిబియ్యం అందజేశారు. సాయంత్రం అనంతరం గోపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కవిత

చెన్నూరు : గిరిజన ప్రజలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. బుధవారం మండలంలోని దౌలతాపురం యానాదికాలనీలోగల ప్రాథమిక పాఠశాలలో ఆమె న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. గిరిజన ప్రజలకు సంబంధించి అనేక చట్టాలు ఉన్నాయన్నారు. అందుకు సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజనులకు సంబంధించి ఫిర్యాదుల పరిష్కారం, న్యాయ సహాయం తదితర అంశాలను జడ్జి వివరించారు. అనంతరం ఒంటరియో సెకండరీ స్కూలు టీచర్స్ ఫెడరేషన్, కెనడా వారి ఆర్థికసాయంతో జన పరిషత్ సంస్థ ప్రెసిడెంట్ జోసెఫ్ చెప్పాలయ్య సహకారంతో విద్యార్థులకు 10 బెంచీలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ సురేష్ సహాయం, మండల విద్యాధికారి షర్మిలారాణి, ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయులు జయరాజు, ఉపాధ్యాయులు మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలి

గోపవరం : ఉపాధి హామీ పథకంలో రోజువారీ కూలీలను మరింత పెంచాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పీడీ పాల్గొన్నారు. 2021 ఏప్రిల్ నుండి 2022 మార్చి వరకు జరిగిన 891 పనులకు సంబంధించి రూ.13 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఈ పనులకు సంబంధించి గత నెల 24 నుంచి 31వ తేదీ వరకు 17వ సామాజిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం ప్రజావేదిక ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీల వారీగా చేపట్టిన పనులు, ఖర్చు చేసిన వివరాలను సోషల్‌ఆడిట్ సిబ్బంది చదివి వినిపించారు. హార్చికల్చర్‌కు సంబంధించి అధిక శాతం మామిడి చెట్లు చనిపోయాయని సోషల్‌ఆడిట్ సిబ్బంది పీడీ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సంబంధిత రైతుల చేత తిరిగి నాటించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని కావాలని డిమాండ్ నోటీసు ఇచ్చిన గ్రూపులకు పని కల్పించాలని సూచించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కూలీల సంఖ్యను నేటి నుండే పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఎస్సీ, ఎస్టీలను వంద శాతం పనులకు వచ్చేలా చూడాలన్నారు. జిల్లా విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, అపుట్స్‌మెన్ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

'టీడీపీ నాయకులే అబద్ధాలు చెప్పిస్తున్నారు'

కమలాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు కౌన్సిలర్ నీలం ప్రమీలను టీడీపీ నాయకులే బెదిరించి అబద్ధాలు చెప్పిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు మహ్మద్‌సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డిలు అన్నారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నీలం ప్రమీల తన ఆరోగ్యం సరిగాలేనందున ప్రజలకు సేవ చేయలేక పోతున్నానని తానే స్వయంగా రాజీనామా చేసిందని, ఈ రాజీనామాను ఈనెల 11వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లందరూ ఏకగ్రీవంగా ఆమోదించారన్నారు. కౌన్సిల్‌లో తమకు 14 మంది కౌన్సిలర్లు ఉన్నప్పుడు 20వ వార్డు కౌన్సిలర్ రాజీనామా చేసినంత మాత్రాన ఏమీకాదని వారు ప్రశ్నించారు. నీలం ప్రమీల టీడీపీ నాయకుల బెదిరింపులకు భయపడి ఆమె మాట మార్చి తమపై అభాండాలు వేసిందన్నారు. ఆమె తన రాజీనామా పత్రంలో ఆమెనే స్వయంగా సంతకం పెట్టి నరగ పంచాయతీ కార్యాలయంలో ఇచ్చిందన్నారు. టీడీపీ నాయకులు ఇకనైనా అబద్ధాలు మానుకుని నిజాలు మాట్లాడాలని వారు హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మస్తానయ్య, శివక్రిష్టారెడ్డి, మర్రి సుబ్బన్న, దాసరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.


రైతుల అభివృద్ధికి కృషి చేయాలి



కేవీకే, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : రైతుల అవసరాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని, వారి అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), వ్యవసాయ పరిశోధన, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య కేవీకేలో చేపట్టిన సాంకేతిక కార్యక్రమాల ప్రగతిని వివరించారు. 2022–23 సంవత్సరానికి సేద్య విభాగం వరిలో ఎన్ఎల్ఆర్ –3354, ఎన్ఎల్ఆర్–40054 రకాలు పరిశీలించడం, కందలో యల్ఆర్‌జీ–105 రకాన్ని, వేరుశనగలో సేంద్రియ పోషక యాజమాన్య పద్ధతులు, నువ్వులో రసాయనిక పద్ధతిలో కలుపు నివారణ, సస్యరక్షణ విభాగంలో వేరుశనగలో సస్యరక్షణ విధానాలను సేంద్రియ పద్ధతుల ద్వారా ఆచరించడం,, పశు విజ్ఞాన విభాగంలో పశువుల్లో పొదుగు వాపు వ్యాధి తదితర అంశాల గురించి తెలియచేశారు. ఏరువాక కేంద్ర సమన్వయకర్త మురళీకృష్ణ వరిలో యూటీఆర్ –181, ఎన్ఎల్ఆర్–3418, బీపీటీ 3082, ఎంసీఎం –125, జొన్నలో ఎన్‌జె– 2667 వంటిచిరు పంటలను రైతు పొలాల్లో పరీక్షించినట్లు తెలిపారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసచారి మాట్లాడుతూ రైతుల అవసరమైన వ్యవసాయ పరిశోధనతోపాటు తమ కేంద్రంలో ప్రతి నెల సహాయ వ్యవసాయ సంచాలకులకు శిక్షణ, సందర్శన కార్యశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల్లోని గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ప్లాంట్ డాక్టర్ అనే సామర్థ్య పెంపు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ముస్లిం, మైనార్టీలను అణచివేసింది బాబే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: ముస్లిం, మైనార్టీలను అణిచివేసింది చంద్రబాబేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక మారుతీనగర్‌లోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ హయాంలోనే ముస్లింలకు భద్రత అని చంద్రబాబు చెప్పడం పచ్చి అబద్ధమన్నారు. బీజేపీతో పొత్తుపెట్టుకొని 2014లో విజయం సాధించిన చంద్రబాబు ముస్లిం మైనార్టీలను పూర్తిగా పక్కనబెట్టారన్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క ముస్లింను కూడా కేబినెట్‌లోకి తీసుకోకుండా దూరం పెట్టారన్నారు. నారా హమారా సభలో ప్లకార్డులు చూపిన నేరానికి ముస్లిం యువకులపై దేశద్రోహం కేసులు పెట్టిన ఘనత చంద్రబాబుది కాదా అని ప్రశ్నించారు. ముస్లిం మైనార్టీలు గెలవగలిగే స్థానాలను చంద్రబాబు వారికి ఇవ్వలేదని, అదే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలవగలిగే స్థానాలనే ముస్లింలకు ఇచ్చి నలుగురు ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఒక డిప్యూటీ సీఎం, శాసన మండలి డిప్యూటీ ఛైర్మెన్ పదవులు ఇచ్చి గౌరవించారన్నారు. చంద్రబాబును ముస్లిం, మైనార్టీలు ఎప్పటికీ నమ్మబోరన్నారు.

విశ్వనాథపురంలో పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి



కేసీ కెనాల్ సమీపంలో స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలో రైల్వేగేటు అవతల ఉన్న విశ్వనాథపురం ప్రాంత వాసులకు పార్కు ఏర్పాటు చేయడానికి గల అవకాశాలను పరిశీలించాలని కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్లో భాగంగా ఆయన విశ్వనాథపురంలో పర్యటించి పార్కు నిర్మాణానికి, పార్కుకు వెళ్లేందుకు రోడ్డు, పార్కింగ్ స్థలానికి ఏర్పాట్లు చేయడానికి ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఇందుకు పలు సర్వే నంబర్ల ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివరాలను అందజేయాలని ఆదేశించారు. అనంతరం జీటీఎస్ వినాయనగర్‌లో జరుగుతున్న పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కేసీ కెనాల వద్ద జరుగుతున్న 40 అడుగుల రోడ్డును దేవుని కడప వరకూ వేయాలని సూచిస్తూ ఇప్పటికే వేసిన మట్టి రోడ్డు పనులను పరిశీలించారు. అక్రమ కట్టడాలు, లే అవుట్లను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

బ్రౌన్ కేంద్రంతో పీఎస్ఎన్ మూర్తికి గట్టి బంధం



పశుమర్తి సత్యనారాయణ మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంతో పరిశోధకుడు డాక్టర్ పశుమర్తి సత్యనారాయణ మూర్తి (పీఎస్ఎన్ మూర్తి)కి గట్టి అనుబంధం ఉండేదని ఆ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం బ్రౌన్ కేంద్రంలో డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర అతిథులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. పీఎస్ఎన్ మూర్తి లండన్‌లో బ్రౌన్ చిత్రం కోసం 20 సంవత్సరాలపాటు అన్వేషించారని తెలిపారు. ఆయన రాసిన 'ది లైఫ్ ఆఫ్ బ్రౌన్ ఇన్ లండన్ ఆఫ్టర్ రీలివింగ్ ద ఇండియా' పుస్తకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రౌన్ గ్రంథాలయ సందర్శనలో భాగంగా ఆవిష్కరించారని గుర్తు చేశారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథ పాలకులు జి.హరిభూషణరావు పాల్గొన్నారు.

మూల్యాంకన కేంద్రంలో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి కోరారు. ఈ విషయమై బుధవారం వారు డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధ్యాయులకు చల్లని తాగునీరు, గాలి, వెలుతురు వచ్చే విధంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. పసి పిల్లలున్న తల్లులకు, గర్భిణీలకు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి మూల్యాంకన విధుల నుంచి మినహాయించాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో రాష్ట్రకార్యవర్గ సభ్యులు కంభం బాలగంగిరెడ్డి, ఆదినారాయణరెడ్డి ఉన్నారు.

మహిళల భద్రతకు 'దిశ'



రాజుపాళెం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

రాజుపాళెం : మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన 'దిశ' యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు డౌన్లోడ్ చేయించి, రిజిష్టర్ యూజర్‌గా నమోదు చేసుకునేలా వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఎస్పీ అన్బురాజన్ అన్నారు. రాజుపాళెం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఎస్పీ తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, ఉమెన్ హెల్ప్ డెస్క్ రిసెప్షన్ను పరిశీలించి మహిళా పోలీసులతో మాట్లాడారు. స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాటుసారా, అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా, నిషేధిత గుట్కా, దొంగతనాలు అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేయాలని చెప్పారు.పాత పెండింగ్ కేసుల్లో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి సమస్య అడిగి తెలుసుకొని పరిశీలించి, పరిష్కరిస్తామని వారికి భరోసా ఇచ్చారు. అలాగే పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పరిశీలించి త్వరగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకొని డిస్పోజల్ చేయాలని తెలిపారు. ఎస్ఐ రాజగోపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి నమూనాలు సేకరించండి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

పోరుమామిళ్ల : వ్యవసాయ సిబ్బంది ఈ వారంలో వారి వారి పరిధిలో ఉన్న వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాలు సేకరించి జిల్లా మట్టి పరీక్షా కేంద్రానికి పంపించాలని జిల్లా వ్యవసాయాధికారి అయితే నాగేశ్వరరావు ఆదేశించారు. బుధవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డివిజన్‌లోని 5 మండలాలకు చెందిన వ్యవసాయ అధికారులు, రైతు భరోసా కేంద్రాల సహాయకులు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ వారాన్ని మట్టి ఆరోగ్యం, మట్టి పరీక్షా వారంగా పరిగణించాలన్నారు. మట్టి నమూనాలతో పాటు రైతుల వివరాలు పంపించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయశాఖ అమలు చేస్తున్న పథకాలు తదితర అంశాలపై ఆర్బీకేల వారిగా సమీక్షించారు.

వైభవం.. రథోత్సవం

మార్మోగిన శివనామస్మరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలోని శ్రీ ముక్తిరామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం గంగా రాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి వారి రథోత్సవం శివనామస్మరణల మధ్య వైభవంగా జరిగింది. వేకువ జామున సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీమాతకు, ఆదిశంకరాచార్యులు ప్రతిష్టించిన శ్రీ చక్రానికి, ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవ మూర్తులను విశేష అలంకరణ చేసి రథంపై ఆశీనులను చేసి కన్నుల పండువగా రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం, రామేశ్వరం, మోరీలు వద్ద గల చౌడేశ్వరి ఆలయం వద్దకు మధ్యాహ్నం చేరుకుని సాయంత్రం 4 గంటలకు తిరిగి బయల్దేరి ఆలయానికి చేరుకుంది. ఈ రథోత్సవంలో కేరళ సింగారిమేళం, నరసరావుపేట తప్పెట్లు, చెక్కభజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు టంగుటూరి మారుతి ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, మాజీ మండల ఉపాధ్యక్షుడు మల్లేల రాజారాంరెడ్డి, కౌన్సిలర్ వంశీధర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పల్లేటి శంకరరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.





రథోత్సవంలో భక్తులు, (ఇన్‌సెట్) గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరుడు